క్లుప్తంగా

భోజనశాల ప్రారంభం



భోజన శాలను ప్రారంభిస్తున్న ఉప్పులూరి రాంబాబు (రాము)

రాజమహేంద్రవరం రూరల్: వెంకట నగరంలో గ్రామస్తుల సౌకర్యార్థం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ, అరుణ కుమారి దంపతులు భోజన శాల నిర్మాణం చేపట్టారు. ఉప్పులూరి సత్యనారాయణ తన తండ్రి చక్రవర్తి జ్ఞాపకార్థం చేపట్టిన ఈ భోజన శాల నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం ఉప్పులూరి రాంబాబు (రాము) చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామంలో ప్రజలు ఏ కార్యక్రమం జరుపుకొన్నా భోజనాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ భోజనశాల ఉపయోగపడుతుందని ఉప్పులూరి రాము తెలిపారు. కార్యక్రమంలో యెరుబండి వీర వెంకట్రావు, యెరుబండి సూర్యనారాయణ, ఆకుల శ్రీను, బండారు రంగారావు, యెరుబండి వెంకట సాయి పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

సీటీఆర్ఐ: నగరంలోని కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. ఆయన కంబాలపేటలో విస్తృతంగా పర్యటించారు. వర్షాకాలంలో మురుగునీటి ప్రవాహానికి ఎక్కడా ఆటంకం కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అన్ని డివిజన్లలోనూ డీసిల్టింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. డ్రైనేజీల్లో పూడిక, చెత్తా చెదారం కారణంగా మురికినీరు నిలిచిపోయే పరిస్థితి ఉండకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరమైన చోట యంత్రాల సాయంతో పూడికను తొలగిస్తున్నమన్నారు.

అన్నసమారాధన



భక్తులకు అన్నం వడ్డిస్తున్న ధవళేశ్వరం సీఐ గణేష్

ధవళేశ్వరం: గ్రామంలోని రథం వీధి అంకాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. రథం వీధి రాయల్స్ నాయకుడు యడ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ధవళేశ్వరం సీఐ టి.గణేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

ధవళేశ్వరం: స్థానిక క్వారీ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని టీడీపీ నాయకుడు ఆళ్ల ఆనందరావు, పట్టణ అధ్యక్షుడు పండూరి అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జి తలారి మూర్తి తదితరులు బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనంలో పాల్గొన్న కరస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ గుర్రయ్య

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక శ్రీసత్య సాయి గురుకుల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం సాయంత్రం వినాయక విగ్రహ నిమజ్జనం అత్యంత వైభవంగా జరిగింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఏ.శ్యామ్ సుందర్, ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రకాశం నగర్: ఏపీఈపీడీసీఎల్ 33 కేవీ కొంతమూరు, సుబ్బారావు నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ సత్యదేవ ఫీడర్, కోలమూరు ఫీడర్ లైన్ నిర్వహణ పని కోసం శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.శామ్యూల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. రాయుడుపాకలు, కోలమూరు, కొంతమూరు, పరిమి నగర్, బొమ్మన కాలనీ, నాలుగో బ్రిడ్జి సాయిరాం కాలనీ, వెంకటేశ్వర ప్లాస్టిక్ ప్రాంతం, రాజరాజేశ్వరి నగర్, బీసీ కాలనీ, ఆఫీషియల్ కాలనీ, చందన రమేష్ లేఅవుట్, మెయిన్ రోడ్డు, చెంచు కాలనీ, ఎస్‌బీఐ బ్యాంక్ ప్రాంతాల్లో ఆ సమయంలో విద్యుత్ ఉండదన్నారు.

గోదావరి చెంత.. నీటికి చింత

- తాగునీటి సరఫరాలో అవాంతరాలు
- నగర శివారు ప్రాంతాల్లో నీటి ఎద్దడి
- వరద నీటిలో కొట్టుకు వస్తున్న చెత్తతో సమస్యలు

సీటీఆర్ఐ: గోదావరి చెంతనే ఉన్నప్పటికీ నగర ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వారికి సరిపడా నీటిని కుళాయిల ద్వారా యంత్రాంగం సరఫరా చేయలేకపోతోంది. ఈ నీటి ఎద్దడికి ప్రధాన కారణం గోదావరిలో నీరు లేకపోవడం కాదు.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పోటెత్తుతున్న వరదే కారణం.

వివరాలు ఇవీ..

రాజమహేంద్రవరం పేరు వినగానే అందరికీ గలగలపారే గోదావరి గుర్తుకు వస్తుంది. గోదావరి అందాలు, ఇక్కడి ఘాట్లు, నది ఒడ్డున ఉండే ఆలయాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలను చూసి ఎంతో ఆనందిస్తారు. పవిత్ర గోదావరి నీటిని తాగే నగర ప్రజలు ఎంతో అదృష్టవంతులని భావిస్తారు. కానీ గోదావరి పక్కనే ఉన్నప్పటికీ నగరంలోని కొన్ని ప్రాంతాల ప్రజలు తాగునీటికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత వారం రోజులుగా కుళాయిల ద్వారా సరిపడా నీరు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు నదిలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో తాగునీటి కోసం సేకరించే పైప్ లైన్ల వద్ద ఆటంకం ఏర్పడుతోంది. వరదలోని వ్యర్థాలు, చెత్తా చెదారమంతా మోటార్లకు అడ్డుగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో నీటి సేకరణ కష్టంగా మారుతోంది. ఆ ప్రభావం తాగునీటి సరఫరాపై పడుతోంది.



నగరంలోని తాగునీటి సరఫరా కేంద్రం



పుష్కరాల రేవులోని ఇన్‌టేక్ పాయింట్



కుళాయి నుంచి సన్నని ధారగా వస్తున్న నీరు

వరదలు వస్తే అంతే..

ఏటా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రెండు నుంచి మూడు సార్లు గోదావరికి వరద తాకిడి పెరుగుతుంది. పరవళ్లు తొక్కుతూ ప్రవహించే నీటిలో వ్యర్థాలు, చెత్తా చెదారం భారీగా కొట్టుకువస్తాయి. ఇవన్నీ గోదావరిలో నీటిని తోడే మోటార్లలో ఇరుక్కుపోవడంతో నీటి సేకరణ ఇబ్బందిగా మారుతుంది. మారుతున్న పరిజ్ఞానానికి అనుగుణంగా నీటిని సేకరించేందుకు ఆధునిక మోటార్లను వినియోగించాల్సిన అవసరం ఉంది.

> **నీరు సన్నగా వస్తోంది**
>
> రాజేంద్ర నగర్‌లో కుళాయిల నుంచి నీరు చాలా సన్నని ధారతో వస్తోంది. గత రెండు రోజుల నుంచి నీటి రంగు మారింది. రెండు బిందెలు నిండటానికి చాలా సమయం పడుతోంది. దీనితో తాగడం కోసం మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసుకుంటున్నాం.
>
> – కె.సుశీలమ్మ, సింహాచలనగర్

ఒక్క పూటకే పరిమితం

నగరంలో ప్రతి రోజూ 67 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తారు. అందుకోసం అర్బన్‌లో 29 రిజర్వాయర్లు ఏర్పాటు చేశారు. అయితే నగరంలోని కొన్ని చోట్ల మాత్రమే కుళాయిల నుంచి నీరు ఎక్కువ సమయం వస్తోంది. శివారు ప్రాంతాలైన క్వారీ మార్కెట్, సుబ్బారావు నగర్, రామదాసు పేట, సింహాచలం నగరం, బృహన్నల పేట, చెంచు కాలనీ, కోటిలింగాలపేట, రాజేంద్ర నగర్, సిద్ధార్థ్ నగర్ తదితర ప్రాంతాలలో నీటి ధార చాలా సన్నగా రావడంతో రెండు బిందెలు నిండేసరికి కుళాయి ఆగిపోతోంది. నగర శివారు ప్రాంతాలైన 40, 41, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50 డివిజన్లలో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుళాయిల నుంచి నీరు చాలా సన్నగా రావడంతో పాటు రంగు కూడా మారి ఉంటుంది. ముందుగా ఆ నీరు వచ్చి, ఇక కుళాయి కట్టే సమయానికి స్వచ్ఛమైన నీరు రావడం మొదలవుతోంది.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, చిత్రంలో భరత్ రామ్ తదితరులు

- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- మహానేతకు నివాళి

రాజమహేంద్రవరం సిటీ: దివంగత మంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సెంట్రల్ జైలులో ఎంపీ మిథున్ రెడ్డిని కలవడానికి వచ్చిన ఆయన వీఎల్ పురం, మార్గాని ఎస్టేట్స్‌లోని వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయాన్ని బుధవారం మధ్యాహ్నం సందర్శించారు. ఆయనతో పాటు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆలూరు ఎమ్మెల్యే బి. విరూపాక్షి, రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఉన్నారు. వారికి మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు మార్గాని నాగేశ్వరరావు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

రామాయణ పారాయణ నిత్యకృత్యం కావాలి

- సాహితీవేత్త వారణాసి సుబ్రహ్మణ్యం
- ఉత్సాహంగా సరస్వతీ సపర్యా మహోత్సవాలు



వారణాసి సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న నిర్వాహకులు

సీటీఆర్ఐ: వాల్మీకి మహర్షి రచించిన రామాయణంలోని ఏడు కాండల నుంచి ప్రతి రోజూ ఒక్క సర్గ అయినా చదవాలని, ఇది నిత్యకృత్యం కావాలని సాహితీ వేత్త వారణాసి సుబ్రహ్మణ్యం అన్నారు. గోదావరి గట్టున ఉన్న ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాలలో జరుగుతున్న 54వ సరస్వతీ సపర్యా మహోత్సవాలలో భాగంగా బుధవారం ఆయన రామాయణంలో మానవ సంబంధాలు అనే అంశంపై ప్రసంగించారు. సంస్కృత భాషలో ప్రవేశం లేని వారు సైతం శ్లోకానువాదాలను ప్రతిరోజు చదవాలన్నారు. మానవుని ప్రవర్తనా సరళి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో తెలిపేదే రామాయణం అన్నారు. కనిపించని దేవతలను ఆరాధించడం కన్నా, ప్రత్యక్ష దైవాలైన తల్లి, తండ్రి, గురువులను ఆరాధించడం, తరించడం సులభమైన మార్గమన్నారు. వీరు ముగ్గురూ దైవానికి ప్రతీకలు అని శ్రీరాముడు అయోధ్యకాండలో సీతమ్మతో అన్న మాటలు శిరోధార్యాలు కావాలన్నారు. తనను కలవడానికి వచ్చిన భరతునితో తండ్రి క్షేమ సమాచారం అడిగిన శ్రీరామచంద్రుడు.. భరతుడు సమాధానం ఇచ్చే లోపునే రాజ్యపాలన, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అనేక ప్రశ్నలను సంధించారని, రామునికి ప్రజా సంక్షేమం పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఈ ప్రశ్నలు తార్కాణంగా నిలుస్తాయన్నారు. చిన్నారి కందుకూరి సాయి లక్ష్మీ గాయత్రి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందరినీ అలరించింది. అనంతరం వారణాసి సుబ్రహ్మణ్యాన్ని కళాశాల ప్రిన్సిపాల్ వి.అన్నపూర్ణ, సిబ్బంది సత్కరించారు. కాగా.. గురువారం ముగింపు ఉత్సవాలలో ఏలూరుకు చెందిన జ్యోతిష మార్తాండ శ్రీహరి శ్రీనివాసు మైరావణ చరిత్రపై ప్రసంగించనున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాల గురించి వివరిస్తున్న సైబర్ ల్యాబ్ పోలీసులు

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగపరుస్తూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు రాజమహేంద్రవరంలోని సైబర్ ల్యాబ్ పోలీసులు వైవీ సురేష్, అబ్దుల్ షౌకత్ సూచించారు. మండలంలోని కానవరం ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ గేమ్‌లతో కొంతమంది విద్యార్థులను సైబర్ నేరగాళ్లు మాయచేసి, సులువుగా సొమ్ములు లాక్కుంటున్నారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ సొమ్ములు పొందవచ్చనే దురాశకు పోయే వారే ఇటువంటి నేరగాళ్లకు చిక్కుతారన్నారు. అత్యాశకు పోకుండా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అడుగులు వేయాలని హితవు పలికారు. ముఖ్యంగా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అపరిచితులతో చాటింగ్‌లు చేయవద్దన్నారు. తెలియని లింకులు, మెయిల్స్ ఓపెన్ చేయకూడదన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

రైతులకు యూరియా అందించాలి

సీతానగరం: మండల గ్రామాల్లోని రైతులకు యూరియా పుష్కలంగా అందించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు ముదునూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో రైతులు ఏఓ గౌరీదేవిని కోరారు. ఈ మేరకు బుధవారం సీతానగరం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ గౌరీదేవిని కలిసి పార్టీ రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో పార్టీ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం నియోజకవర్గ చైర్మన్ పోలినాటి ఈశ్వరుడు, రైతులు లక్కిశెట్టి కృష్ణ, పచ్చిమట్ల మణిరాజు, ఇందుకూరి రవి, ముదునూరి సుబ్రహ్మణ్యం తదితరులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రైతులకు ఒక బస్తా కాకుండా ఎంత అవసరమో తెలుసుకుని అందించాలని కోరారు. ప్రైవేట్ వ్యాపారులు వద్ద యూరియా కొనుగోలు చేయాలంటే యూరియా బస్తాతోపాటు కాంప్లెక్స్ ఎరువులు, గుళికలు తీసుకోవాలని నిబంధన పెడుతున్నారని, దీంతో రైతులపై అధిక బారం పడుతుందన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సకాలంలో ఎరువులు వేయకపోతే పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని, సమయానికి ఎరువుల వేయాలన్నారు. ఇటువంటి ఇబ్బంది రైతులకు గతంలో ఎప్పుడూ కలగలేదని వివరించారు. ఇప్పటికైనా యూరియాను పుష్కలంగా రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ముదునూరి ప్రసాదరాజు, కోసూరి నాగరాజు, బైర్రాజు చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు

కూలి పనికి వెళితే కులం పేరుతో వేధింపులు

సీటీఆర్ఐ: మల్లిడి శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి తనను కులం పేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడ్డాడంటూ రాజానగరం మండలం సూర్యారావుపేటకు చెందిన దొండపాటి దుర్గ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ ప్రకారం.. దుర్గ పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో రంగంపేట మండలం ఈలగోలను గ్రామానికి చెందిన నురుకుర్తి సాల్మన్ రాజు కుమార్తె ముత్య మాధురికి చెందిన పామాయిల్ తోటలో కూలి పని వెళ్లింది. అక్కడ పనిచేస్తుండగా పక్క పొలం యజమాని మల్లిడి శ్రీనివాస రెడ్డి..ఆమెను వీడియో తీశాడు. కులం పేరుతో దుర్భాషలాడాడు. అక్కడ పని చేయొద్దంటూ బెదిరించాడు. దీనిపై రంగంపేట పోలీస్ స్టేషన్‌కు వెళితే ఆమెకు న్యాయం జరగలేదు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో గత నెల 15వ తేదీన దుర్గ ఫిర్యాదు చేయగా, ఆమెను స్టేషన్‌కు పిలిపించి కేసు వాపసు తీసుకోకపోతే కేసులు పెడతానని బెదిరించారు. సమావేశంలో బీసీ ప్రజా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వారికి ఎలాంటి హక్కూ లేదు

ప్రకాశం నగర్: ఈలకొలను గ్రామంలోని పామాయిల్ తోటలపై ముత్య మాధురికి, సాల్మన్ రాజుకు ఎలాంటి హక్కు లేదని నురుకుర్తి వరలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం సాయంత్రం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి 6న ఆ తోటపై హక్కులు తనవేనని సుప్రీం కోర్టు ఆర్డర్ ఇచ్చిందన్నారు. మాధురి, సాల్మన్ రాజు తమ పద్ధతి మార్చుకుని తోట జోలికి రాకుండా ఉండాలని హితవు పలికారు.

ఎల్ఐసీ ఉద్యోగుల హెల్త్ వాక్



హెల్త్ వాక్‌లో మాట్లాడుతున్న ఎల్ఐసీ రాజమండ్రి డివిజనల్ సీనియర్ మేనేజర్ సత్యనారాయణ సాహు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారతీయ జీవిత బీమా సంస్థ బీమా వారోత్సవాలలో భాగంగా బుధవారం మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం నుంచి వాక్ ఫర్ ఎల్ఐసీ – ఎల్ఐసీ ఎంప్లాయిస్ హెల్త్‌వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాజమండ్రి డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ జెండా ఊపి ప్రారంభించారు. మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు కోదండరామ్, విశ్వనాథ్, వీర కిశోర్, తాతారావు, శిరీష, గన్నియ్య, సాయి శ్రీనివాసరావు, నాగబాబు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు

భారతీయ జీవిత బీమా వారోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం స్కూలు విద్యార్థులకు ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో చిత్రలేఖనం, క్విజ్, కలరింగ్, పాటల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వీటిలో పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారు. విజేతలకు బీమా వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేస్తారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు నాశనం



మాట్లాడుతున్న సీఐ వీరయ్య గౌడ్

రాజానగరం: క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగా పయనించాలని స్థానిక సీఐ వీరయ్యగౌడ్ విద్యార్థులకు సూచించారు. అంతేగానీ తోటి విద్యార్థులను అల్లరి పెట్టి ఆనందించాలనుకుని ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో యాంటీ ర్యాగింగ్, డ్రగ్ అబ్యూస్ అనే అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. చదువు విలువను తెలుసుకుని, కన్నవారి ఆశలకు అనుగుణంగా ఎదగాలన్నారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో ఉన్నతమైందని, దానిని సద్వినియోగం చేసుకుంటే జీవితం కూడా ఉన్నతంగానే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వీసీ డాక్టర్ కేవీవీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ఎస్సై అలెగ్జాండర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎస్ఎస్ మూర్తి, ఎస్ఎస్ఎస్ పీఓ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ



కాపవరంలో తనిఖీ చేస్తున్న అధికారులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. బలభద్రపురం గ్రామంలో సొసైటీ, కాపవరంలో శ్రీనివాసా ఏజెన్సీస్, శ్రీవెంకట రామా ఏజెన్సీస్ దుకాణాల్లో ఎరువులు, పురుగుమందుల స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.మధుబాబు మాట్లాడుతూ బిక్కవోలు మండలంలో సుమారుగా 55 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎమ్మార్పీకి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. ఈ తనిఖీలో అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎస్.లక్ష్మినారాయణ, రంగంపేట వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాస్, ఏఈవోలు కొవ్వూరి మల్లికార్జున భాస్కర్‌రెడ్డి, కోనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుతోనే బీమా నష్టపరిహారం

కోరుకొండ: ప్రతి రైతు పంట నమోదు చేసుకోవడం ద్వారా పంట నష్టపరిహారం, బీమాను పొందగలరని ఉద్యానశాఖ కోరుకొండ మండలాధికారి రినీ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులు రాయితీని పొందాలంటే ఈ–పంటలో నమోదై ఉండాలన్నారు. కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు ఆమె అవగాహన కల్పించారు. మండలంలో 8,787 ఎకరాల ఉద్యాన పంటలకు గాను ఇప్పటి వరకూ 3,500 ఎకరాలకు మాత్రమే ఈ–క్రాప్ పూర్తయ్యిందన్నారు. మిగిలిన జీడిమామిడి, మామిడి రైతులు.. రైతు సేవాకేంద్రాల ద్వారా నెల 30వ తేదీ లోపుగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం



ఆచంట మారుతీ దేవి



గోలి దేవకుమార్



పెనుమాక సునీల్



దారపు రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. మహిళా విభాగానికి ఆచంట మారుతీ దేవి (కాతేరు), ఆర్టిసన్ సెల్ విభాగానికి గోలి దేవకుమార్ (దేవా)(ధవళేశ్వరం), సోషల్ మీడియా విభాగానికి పెనుమాక సునీల్ (కాతేరు), మున్సిపల్ విభాగానికి దారపు రామకృష్ణారెడ్డి (28వ డివిజన్) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

రాజమహేంద్రవరం రూరల్: దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని, విభేదాలు లేకుండా అందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమహేంద్రవరం ఆర్‌డీవో కృష్ణ నాయక్ అన్నారు. పిడింగొయ్యిలోని సర్వే నంబర్ 511 ప్రభుత్వ భూమిలోని శివాలయం, అంబేద్కర్ విగ్రహం ఉన్న ప్రాంతాన్ని బుధవారం వారు పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించడంతో ఈ సమస్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. కొంత స్థలాన్ని శివాలయం నిర్మాణానికి, మరి కొంత స్థలాన్ని అంబేద్కర్ విగ్రహం, కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు కేటాయించి, మిగిలిన భూమిని పంచాయతీ పరిధిలో ఇళ్లు లేని వారికి ఇస్తామన్నారు. సదరు విషయాన్ని ఇరువర్గాలూ ఆలోచించి తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేత జూహితకు ఘన స్వాగతం



జూహిత గుణను అభినందిస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: అహ్మదాబాద్‌లో జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన జూహిత గుణకు ఘనంగా స్వాగతం లభించింది. ఆమె లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జూహిత బుధవారం నగరానికి చేరుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు ఘన స్వాగతం ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ నుంచి పాఠశాల వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. పాఠశాల వద్ద సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా.. జూహిత తల్లి పార్వతి సచివాలయం మహిళా పోలీసుగా, తండ్రి దేవీ ప్రసాద్ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధురాలిని ఓల్డేజ్ హోంలో చేర్పిస్తున్న సమీరాబేగం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామంలో మతి స్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వృద్ధురాలిని సామాజిక కార్యకర్త, వైఎస్సార్ సీపీ నాయకురాలు షేక్ సమీరా బేగం బుధవారం రూత్ ఓల్డేజ్ హోంలో చేర్పించారు. ఆ వృద్ధురాలు నాలుగు రోజులుగా గ్రామంలో తిరుగుతోందని, మానసిక పరిస్థితి సరిగ్గా లేక ఏమీ చెప్పలేకపోతుందన్నారు. దీంతో మంగళవారం రాత్రి ఆమెను తన ఇంటిలో ఉంచి, రూత్ ఓల్డేజ్‌హోంలో చేర్పించడం జరిగిందన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు బొమ్మూరు మురళీకొండపై ఉన్న రూత్ ఓల్డేజ్ హోంలో సంప్రదించాలన్నారు.



శ్యామల:	సుందరకాండ
సూర్యమినీ:	మహావతార్ నరసింహ
సూర్యప్యాలెస్:	సుందరకాండ
స్వామి:	కూలీ
అనుశ్రీ:	త్రిబాణదారి బార్బరిక్
శివజ్యోతి:	బ్రహ్మాండ,తమ్ముడు
రాజా:	సుందరకాండ
ఊర్వశి:	కుబేర
మేనక:	సుప్రమ్‌సో
రంభ:	మహావతార్ నరసింహ
అప్సర:	కొత్తలోక
అశోక:	వార్–2
నామవరం	
వీఎస్ మహల్:	మహావతార్ నరసింహ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ:	కొత్తలోక
కడియం	
వెంకటసూర్య:	మదరాసి,ఘాటీ